క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోకవరం: గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సోమవారం శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆదివారం తెలిపారు. గ్రామంలోని ఠాణాసెంటర్‌లో బ్రిటిషు కాలం నాటి వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ రహదారి 516–ఇ నిర్మాణంలో భాగంగా ఈ వంతెనకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ వంతెనకు సోమవారం ఉదయం ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం స్థానిక సంత మార్కెట్‌లో షెడ్లు నిర్మాణానికి భూమిపూజ చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

పెదపూడి: మండలంలోని గొల్లల మామిడాడలో ఉన్న సత్య ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ తదితరులు మెల్విన్ జోన్స్, మదర్ థెరిసా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు అన్నదానం చేశారు. అనంతరం వివిధ లయన్స్ క్లబ్‌ల్లో 60 ఏళ్లు నిండిన సీనియర్ దంపతుల షష్ఠి పూర్తి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బాదం బాలకృష్ణ, క్లబ్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, కార్యదర్శి ద్వారంపూడి యవరాజారెడ్డి, కోశాధికారి ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి, పీఎస్ఎన్ రెడ్డి, మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

రంగంపేట: మండలంలోని మర్రిపూడి శివారు పామాయిల్ తోటలో అక్రమంగా సారా తయారుచేస్తున్న పీతా నూకరాజును అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ దాడిలో 470 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె చెప్పారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ కె.శేఖర్‌బాబు, గ్రామ వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

10 మద్యం సీసాలతో మరొకరు..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో 180 ఎంఎల్ పరిమాణంతో ఉన్న 10 మద్యం సీసాలను కలిగి ఉన్న మొల్ల అప్పారావును అరెస్టు చేసినట్లు రంగంపేట ఎక్సైజ్ సీఐ జి.వెంకటలక్ష్మి ఆదివారం తెలిపారు.

రక్తదాన శిబిరం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సెప్టెంబరు రెండో తేదీన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు చేసినవారికి జనసేన రాజానగరం ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన యువకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి జాతర



పెంటపల్లి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని పెంటపల్లి గ్రామదేవత ముత్యాలమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల వరకు ఆలయ ప్రాంగణంలో భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీతారామ భజన సమాజం, శ్రీకృష్ణ మహిళా భజన సమాజం, శ్రీసత్యదుర్గ భజన సమాజం, భగీరథ భజన సమాజం సభ్యులు పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీకృష్ణ భజన సమాజం గురువు కుక్కల అన్నవరాన్ని ఆలయ కమిటీ సభ్యులు జగదీష్, నాగన్న, పాండురంగ తదితరులు సత్కరించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీట్ హోల్డర్స్, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనికి సుమారు 120 మంది పాత నేరస్తులు హాజరైనట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి కేసుల్లో తమ ప్రమేయం ఉంటే సహించేది లేదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. దీని దృష్టిలో ఉంచుకుని రౌడీషీటర్లు, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. గంజాయి వివిధ మానసిక, శారీరక ప్రభావాలను కలిగి ఉంటుందన్నారు. దీన్ని తాగడం వల్ల జ్ఞాపకశక్తి బలహీనపడుతుందన్నారు.

‘సస్యరక్షణ’తో అధిక దిగుబడి

- తెగుళ్లు ఆశించకుండా చర్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు
- అనపర్తి నియోజకవర్గంలో 46 వేల ఎకరాల్లో వరిసాగు



కరకుదురులో వరి పొలం

పెదపూడి: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి సాధ్యమని, పంటను ఆశించే తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి, జాగ్రత్తలు తీసుకోవాలని పెదపూడి మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో అనపర్తి నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 9,550 ఎకరాలు, బిక్కవోలులో 15,741, పెదపూడిలో 18,000, రంగంపేట మండలంలో 2,776 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధంచి వరి పంటను ఆశించే తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు ఏఓ పలు సూచనలు చేశారు.

తెగుళ్లు – నివారణ చర్యలు

ఆకుమచ్చ తెగులు : గొంగలి పురుగు ఆకుముడతలో ఉండే పత్ర హరితాన్ని తినివేయడంతో ఆకులు తెల్లబడతాయి. పంట పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో రెండు మూడో సార్లు లాగితే పురుగులు కింద పడతాయి. వీటి నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5మిల్లిలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి.

సుడిదోమ : వరి పంట అంకురం దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు సుడిదోమా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. గోధుమ వర్ణంలో దుబ్బుల అడుగున నీటిమట్టంపై ఉండి మొక్క రసాన్ని పిల్చుతాయి. దీనివల్ల పైరు సుడులు తిరిగి ఎండిపోతుంది. వరినాట్లు వేసేటప్పుడే ప్రతి రెండు మీటర్ల పొడవుకు 20 సెంటీ మీటర్ల వెడల్పుతో బాటలు వదలాలి. పంటలో దోమ ఉధృతి ఎక్కువ అయినప్పుడు లీటర్‌నీటికి రెండు మిల్లీలీటర్ల ఇథోపెన్‌ప్రాక్స్ మందును కలిపి పిచికారీ చేయాలి.

తుప్పు తెగులు : నేలలో జింక్ లోపం ఉన్నప్పుడు పంటను తుప్పు తెగులు ఆశిస్తుంది. నాట్లు వేసిన 2 నుంచి 6 వారాల్లో ఆకు చివరలో ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా పెలుసుగా మారిపోయి వాటిని వంచగానే విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు, పైరుకు జింక్‌లోపం కనిపించగానే జింక్ సల్ఫేట్ కలిపి అయిదు రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేయాలి

కాండం కుళ్లు తెగులు : ఆకుతొడిమపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. లోపలి కాండానికి విస్తరించి కణుపులు మధ్య భాగమంతా నల్లగా మారిపోతుంది. కాండం చీల్చి చూస్తే తెల్లని లేదా నల్లని శిలీంద్రాల బీజాలు కనిపిస్తాయి. గింజ పాలుపోసుకునే దశ నుంచి గట్టిపేడ వరకు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తాలు గింజలు ఏర్పడి 30 నుంచి 80శాతం పంట నష్టపోయే అవకాశం ఉంది. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే లీటర్ నీటికి 2 మిల్లీలీటర్ల థయాపానేట్ మందును కలిపి పిచికారీ చేయాలి

పాముపొడ తెగులు : చేను దుబ్బ చేసే దశలో ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. నివారణకు ఒక మిల్లీ లీటర్ ప్రాపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గి తెగులు : ఈ తెగులు సోకినప్పుడు ముదురు ఆకులపై నూలు కండె ఆకారంలో గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎర్ర బడతాయి. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సూచనలు పాటిస్తే..



వరి సాగులో రైతులు వ్యవసాయశాఖాధికారుల సూచనలు సలహాలు పాటిస్తే తప్పనిసరిగా అధిక దిగుబడి పొందవచ్చు. సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టడంతో అనుకున్న స్థాయి కన్నా ఎక్కువ పంట చేతికొచ్చే అవకాశం ఉంటుంది. అన్ని గ్రామాల్లో అధికారులు పర్యటించి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తున్నారు.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయశాఖాధికారి, పెదపూడి

గుమ్మళ్లదొడ్డి ఐఓసీఎల్‌లో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున ఉన్న ఐఓసీఎల్ టెర్మినల్‌లో శనివారం లెవల్–3 మాక్‌డ్రిల్ నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి బి.పమిత, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి, రాజమహేంద్రవరం అగ్నిమాపక అధికారి కె.రమణ, గోకవరం ఎస్సై ఎంవిఆర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఐఓసీఎల్ పైపులైన్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే తీసుకునే నివారణ చర్యలను కళ్లకు కట్టినట్టు మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. ఐఓసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి టి.సాయికిషోర్ మాట్లాడుతూ మాక్‌డ్రిల్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఐఓసీఎల్, గెయిల్, హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ల మార్కెటింగ్ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు ఆదివారం తెలిపారు. దాడిలో కొంకుదురు గ్రామానికి చెందిన పేరూరి మురళి, నేకూరి శ్యాంకుమార్, నేకూరి చిట్టిబాబు, నేకూరి నవీన్, పి.సతీష్‌లను అరెస్టు చేశామన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- తొస్సిపూడిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



తొస్సిపూడిలో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలను ప్రవేశపెట్టి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తొస్సిపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం వైద్య సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ క్లినిక్, రైతు సేవలను అందించడానికి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పాలన వల్ల సంతోషంగా ఉన్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపరపు శ్రీనివాస్, రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ తేతలి సుమ, ఉప సర్పంచ్ ద్వారంపూడి వీర వెంకటరామారెడ్డి(తంబీ), కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, కర్రి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మన సత్తా చాటుదాం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే మనకు శ్రీరామరక్ష అని, వచ్చే ఎన్నికలలో మన సత్తా చాటి ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతు చేద్దామని తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. స్థానిక జీవీకే కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ పని చేస్తున్న ప్రభుత్వానికి మరింత అండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచి ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం వంద శాతం పథకాలను అమలు చేసి ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. ప్రతి పథకం నేరుగా ప్రజల ఖాతాలకు వేస్తూ సీఎం జగన్ అవినీతికి స్వస్తి పలికారన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందేలా వలంటీర్, సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. గత ఎన్నికలలో చంద్రబాబు 650 పైగా వాగ్దానాలు ఇచ్చి అందులో 10శాతం హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజలు నిలదీస్తారని మెనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనం టీడీపీదేనని ఎద్దేవ చేశారు, రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు త్వరలోనే పూర్తి చేస్తామని, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఆధునీకరణ పనులు, రఘుదేవపురంలో సీహెచ్‌సీ నిర్మాణానికి త్వరలో శంఖుస్థాపన, చినకొండేపూడిలో టీటీడీ కల్యాణ మండప నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాబోరు కురుక్షేత్ర యుద్ధంలో ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న వైస్ ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకటకృష్ణ చౌదరి, కొండపల్లి దుర్గారావు, సర్పంచ్‌లు కోండ్రపు ముత్యాలు, మెల్లిమి రామచంద్రరావు, సత్యం రాంపండు, మద్దాల కొండలరావు, కవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిపోతున్న బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు



బ్లేడ్ బ్యాచ్ దోపిడీకి గురైన నాగదుర్గ

రాజానగరం: లాలాచెరువు నుంచి దివాన్‌చెరువు వరకూ బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా ఫారెస్టు అకాడమీ, మహాపుష్కర వనం, గామన్ బ్రిడ్జి రోడ్డు, ఆటోనగర్‌ల వద్ద రహదారిపై రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లే వారిని టార్గెట్ చేసి, బ్లేడ్‌లతో బెదిరించి దోపిడీకి పాల్పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆటోనగర్‌లో ఉదయం 9 గంటల ప్రాంతంలో కొత్త హైవే నుంచి ఏడో రోడ్డుకు వస్తున్న గ్యాస్ వెల్డర్ యూనియన్ సభ్యుడు జి.నాగదుర్గని బ్లేడ్ బ్యాచ్ అకస్మాత్తుగా దాడి చేసి గొంతుపై గాయం చేసింది. అతని వద్ద ఉన్న రూ.1500 దోచుకుని పారిపోయింది. అలాగే ఈనెల 23న ఆటోనగర్‌కి వెళ్లే దారిలో మరో యువకుడిపై దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.18 వేలు లాక్కుని పరారయ్యారు. ఈ సంఘటనలపై యూనియన్ పరంగా బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణాలు చేసేవారు ప్రధాన రోడ్ల మీదుగానే ప్రయాణించాలని, అడ్డరోడ్లపై ప్రయణించడం అంత సురక్షితం కాదని అంటున్నారు. అనుమానాస్పదంగా సంచరించేవారు ఎవరైనా తారసపడితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరుతున్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాజమహేంద్రవరం–సీతానగరం రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



కాటవరం వద్ద రాజమండ్రి–సీతానగరం రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాజమహేంద్రవరం–సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో రాజీపడొద్దని తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం రోడ్డు నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. దగ్గరుండి పనుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య, నిరంకుశ పాలనకు నిదర్శనమే ఈ సీతానగరం రోడ్డని, ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రధాన రహదారి విస్తరణ నిర్మాణ పనుల ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రహదారి విస్తరణ పనులకు మార్గం సుగమం చేశారన్నారు. మండల ప్రజల ఆకాంక్ష మేరకు శాశ్వత పద్ధతిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. 18.2 కిలోమీటర్లు పొడవు గల కాతేరు–సీతానగరం రోడ్డును రూ.70 కోట్లతో చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ మధుసూదనరావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీటీసీ తాడిపల్లి వెంకటరావు, పార్టీ నాయకులు చల్లమళ్ళ సుజీరాజు, పిచ్చుకల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాపాక, నల్గొండ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



రాపాక ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రాపాక, సాయంత్రం నల్గొండ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజలందరికీ పథకాలు అందేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశామని, కాబట్టే ధైర్యంగా వారి గడపకు వెళ్లగలుగుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన అండగా నిలబడాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ చింతల స్నేహ ప్రియ, పార్టీ నాయకులు చల్లమళ్ళ సుజీరాజు, పిచ్చుకల రవికుమార్, పిచ్చుకల విజయ్ కుమార్, రావూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు

నయనానందం.. రాధాకృష్ణుల ఊయల ఉత్సవం

సీటీఆర్ఐ: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్, ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాధాకృష్ణుల ఊయల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊయల ఉత్సవాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం సాయంత్రం 7.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్‌చే ఊయల లీలా విశిష్టతపై ఉపన్యాసం ఉంటుందని ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. 30న సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూసాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 31న బలరామ జయంతిని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు గోపూజ జరుగుతుందన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



గుమ్మళ్లదొడ్డిలోని రామగిరి కొండపై సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో పవిత్ర రామగిరి కొండపై వేంచేసిన సత్యనారాయణస్వామి సహిత కోదండరామ ఆలయంలో ఆదివారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం పవిత్ర మాసోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డీఎల్వీ రమేష్‌బాబు, ట్రస్టుబోర్డు సభ్యుడు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, స్థానిక ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్రతాల్లో సుమారు 140 మంది దంపతులు పీతలపై కూర్చొని వ్రతాలు ఆచరించారు. వ్రతాలు ఆచరించిన భక్తులకు దేవస్థానం నుంచి ఉచితంగా పూజాసామగ్రి, స్వామివారి ప్రతిమ, గోధుమనూక ప్రసాదం అందజేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరకణం రామలక్ష్మి, ఎంపీటీసీ కోట సత్యవతి, గ్రామ పెద్దలు ఏగి సత్తిబాబు, అబ్బిరెడ్డి చిన్ని, సరకణం మురళీ, సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న చిన్నారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఆనందంగా డ్యాన్స్ చేస్తున్న యువత

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్‌లో చిన్నారులు, యువత, పెద్దలు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ నిర్వహించే హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమంలో పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో నగర ప్రజలు పాల్గొని ఆనందంగా గడిపారు. జేఎన్‌రోడ్ లోని ఏకేసీ కలేజ్ వద్ద ఉన్న పరమహంస యోగానంద మార్గ్‌లో హ్యాపీ స్ట్రీట్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతి ఆదివారం పలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత, చిన్నారులు డ్యాన్స్‌లు, టెన్నిస్, క్యారమ్స్, చదరంగం, టెన్ని కాయిస్ ఇలా పలు రకాల ఆటలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు నగర వ్యాప్తంగా ప్రజలు తరలివస్తున్నారు. ప్రజలకు ఆదివారం ఆటవిడుపుగా ఉండేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు.

వర్షంతో పంటలకు మేలు



రంగంపేటలో ఆదివారం కురుస్తున్న వర్షం

రంగంపేట: మెట్ట ప్రాంతంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షంతో పంటలకు ఎంతో మేలు కలుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు వేసినప్పటి నుంచి సరైన వర్షాలు లేక పొలాల్లో నెర్రలు రావడంతో రైతులు ఆందోళన చెందారు. స్థానిక దేవాలయాల్లో వరుణుడి కోసం పూజలు చేశారు. శని, ఆదివారాల్లో ఓ మోస్తరు వర్షం కురవడంతో పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాల వల్ల వరి, మినుము పంటలతో పాటు, పామాయిల్, పండ్లతోటలు, కూరగాయ పంటలకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు.